రాధ చావాలి

టెంపోరావ్

ఏక్ కండిషన్డ్ గదిలోకి వయ్యారంగా నడుస్తూ ఆమె వచ్చింది. బాస్ ధనంజయరావు కేసి చిరునవ్వుతో చూసింది. అతడు నవ్వాడు. "సిడౌన్" అన్నాడు.

క్షణకాలం గదిలో నిశ్శబ్దంగా వుంది. అమోఘమైన ఏ ప్రకృతి దృశ్యాన్నో చూస్తున్నట్లు అతడామెవైపు చూస్తూ వుండిపోయాడు.

రిసీవర్ ఎత్తాడు. అటువైపునుంచి వేరొక కంఠం వినబడింది.

"మేరీ, ఎవ్వరూ నా గదిలోకి రాకూడదు. చాలా ముఖ్యమైన పనులు చూస్తున్నాను. ఏదైనా అర్జంటైతే ఫోన్ చేసి మాట్లాడు" అన్నాడతను.

"అలాగే సార్" అంది మేరీ.

అతడు రిసీవర్ పెట్టేశాడు. టేబుల్ మీద వేర్వేరు రంగుల్లో మూడు ఫోన్లు వున్నాయి.

ధనంజయరావు కోటీశ్వరుడు. అతడికి షుగర్ మిల్స్,

సిమెంట్ ఫాక్టరీలు వున్నాయి. అతడి ఫాక్టరీలు అనేక రాష్ట్రాల్లో వున్నాయి.

అతడి వయసు నలభై దాటింది. పొడుగ్గా, పచ్చగా వుంటాడు. అమెరికన్ క్రాపు. గోల్డ్ రిమ్ కళ్ళజోడు అతడి మొహంలాగే మెరుస్తూ వుంటుంది. ధనంజయరావు క్రింద పనిచేసేవాళ్ళు భయభక్తులతో అతడి ముందు ప్రవర్తిస్తూ వుంటారు.

అతడి ముందు ప్రేమ మౌనంగా కూర్చుంది. తనీ కంపెనీలో చేరి యింకా సంవత్సరం కాలేదు. అయినా ఆమె వేగంగా మెట్లెక్కి ఎన్నో ప్రమోషన్లు సాధించింది. మొదట్లో అందరికీ ఆమే టైపిస్టు! నెల తిరిగేలోగా ఆమె ధనంజయరావుకి టైపిస్టు అయింది. మరికొన్ని నెలల్లో ఆమె అతడి సెక్రెటరీగా రూపొందింది. అతడి పెర్సనల్ సెక్రెటరీ! ఎవరికి ఏం కావలసినా ఆమెనే అడగాలి!

దైవం ఆమెకు అందమయిన రూపాన్ని ప్రసాదించాడు. తన అందంతో ఆమె లోకాన్ని జయించుకొంటోంది.

"ప్రేమా, నువ్వు నాతో సింగపూర్ రావలసింది. వాట్ ఎ బ్యూటిఫుల్ సిటీ!" అన్నాడతను.

ఆమె తీయగా నవ్వి వూరుకుంది. అతడి ముందు మాట్లాడే ధైర్యం ఆమెకు లేదు.

"డోంట్ బాదర్! సింగపూర్ కి యిది నా ఆఖరి విజిట్ కాదుగా! మళ్ళా వెళ్తాను. ఈసారి నువ్వు రావచ్చు!"

ఆమె జవాబివ్వలేదు.

"నీ కోసం ఒక వుంగరం కొనితెచ్చాను. డైమండ్

రింగ్!"

ఆమె తృప్తిపడింది. తనకోసం అతడు డైమండ్ రింగు తెచ్చాడా? ఒకవైపు ఆనందపడ్తూ ఆమె మరోవైపున భయపడ్తోంది.

"లోపల గదిలోకి వెళ్దాం, పద!" అన్నాడతను.

ఆమె గుండె వేగంగా కొట్టుకోసాగింది. ఎంతో గొప్పవాళ్ళు అయితే గాని అతడు లోపల గదిలోకి తీసుకువెళ్ళడు!

అతను లేచాడు. రమ్మన్నట్లు ఆమె వంక చూశాడు. అయస్కాంతంలా అతడి చూపు ఆమెను లాగింది.

అతడు తలుపు తోసి లోపలకు వెళ్ళాడు. వెనకనే వెళ్ళిందామె.

మరో ఎర్‌కండిషండ్ గది. అంత అందమైన గదిని ఆమె ఎక్కడా చూడలేదు. నేలమీద లినోలియమ్. చక్కటి సోఫాలు, టీపాయిలు. కొంచెం దూరంలో వెల్వెట్ దుప్పటి పర్చిన స్ప్రింగ్ కాట్, ఫోమ్ బెడ్, తలగడలు!

"కూర్చో! ఫీల్ ఎట్ హోమ్!" అన్నాడు ధనంజయ రావు.

నవ్వుతూ ఆమె పెద్ద సోఫాలో కూర్చొంది. అతడామె ప్రక్కనే కూర్చున్నాడు. ఆమె కళ్ళలోకి తీక్షణంగా చూశాడు.

"సింగపూర్‌లో ఒక బ్యూటీ పోటీ జరిగింది. మిస్ సింగపూర్‌ని ఆ నాడు ఎనుకొన్నారు. ఆమె తలమీద నేను కిరీటం పెట్టాను. ఆమెను చూస్తుంటే నువ్వు నాకు గుర్తొచ్చావు. నువ్వు సింగపూర్‌లో వుంటే మిస్ సింగపూర్ నువ్వు అయేదానవు. నీ తలమీద నేను కిరీటం

పెట్టేవాడిని!"

అతడి మాటలు విని ఆమె లోలోపల మురిసిపోతోంది. తన భర్త యిలా మాట్లాడడు. ఇంటికి రాగానే, "ప్రేమా, నా అండర్ వేర్ ఎక్కడ వుంది?" అని అరుస్తాడు.

ధనంజయరావు సూటు లైట్ కాంతిలో మెరుస్తోంది. కోటు జేబులోంచి ఎర్రటి పెట్టెను అతడు తీసి ఆమె కిచ్చాడు.

"తెర్చి చూడు!"

ఆమె తెర్చింది. లోపలున్న ఉంగరంవైపు చూసింది. రింగులో అమర్చిన డైమండ్ ధగ ధగ మెరుస్తోంది.

"బాగుందా?"

ఆమె ఏమీ చెప్పలేకపోయింది. ఉంగరాన్ని చూస్తూ వుండిపోయింది.

అతడు ఆమెవైపు నవ్వుతూ చూశాడు.

"మన దేశంలో యీ ఉంగరం ధర లక్ష రూపాయలు వుంటుంది," అన్నాడతను.

వుంగరాన్ని ఆమె వేలుకు పెట్టాడతడు. ఆమె చేతివైపు క్షణకాలం చూశాడు.

"ఆ ఉంగరం వుండవలసిన చేతిమీద వుంది!" అన్నాడతను.

ఆమె గుండె అయోమయంగా కొట్టుకుంది.

"ప్రేమా, మాట్లాడు! నన్ను చూసి భయపడకు! నేను ప్రస్తుతం నీ బాస్ కాను. నీ భక్తుడిని!"

క్షణకాలం ఆమె మాట్లాడలేదు. మెల్లిగా ఆమెకు ధైర్యం వచ్చింది.

"ఈ ఉంగరం అత్యద్భుతంగా వుంది. నాలా

ఆఫీసుల్లో పని చేసేవాళ్ళ చేతికి యిది వుండకూడదు!"

"డోంట్ బి సిల్లీ! నువ్వు నా పెర్సనల్ సెక్రెటరీ! నీకు సరైన వుంగరం అది."

"చూడండి! దీన్ని చూసి నా భర్త గాభరాపడ్తాడు. ఇంత విలువైన ఉంగరం నాకిచ్చారని చెప్తే ఆయన అనుమానిస్తారు" అందామె.

"ఇది డైమండ్ రింగని అతడికి చెప్పకు! రోడ్డు వారగా అమ్మేవాడి దగ్గర రూపాయికి కొన్నానని చెప్పు!"

"అది సాధ్యమా?"

అతడు నవ్వాడు. జేబులోంచి మరో రింగు తీశాడు. అచ్చంగా పెట్టెలో వున్న డైమండ్ రింగులా వుందది.

"ఇదెంతో తెలుసా? ఒక రూపాయికి ఎవరేనా మన దేశంలో కొనొచ్చు. ఈ ఉంగరం నీ భర్తకు చూపించు! అతడు అనుమానిస్తే వెళ్ళి ఖరీదు కనుక్కోమను. దాని ధర ఒక రూపాయి మించదని అతడు కనుక్కుంటాడు. నిన్ను అనుమానించడు. అటుపైన నిర్భయంగా అసలు డైమండ్ రింగ్ని నువ్వు వేలికి పెట్టుకోవచ్చు!"

"చాలా ఆలోచించారు!" అందామె.

అతడు విచిత్రంగా నవ్వాడు.

"ఎంతో ఆలోచించి యిన్ని ఫాక్టరీలు నెలకొల్పిన నేను యీ చిన్న విషయం గురించి ఆలోచించకుండా వుంటానా?" అన్నాడతను.

"నేను యిక్కడకు వచ్చినప్పటినుంచీ మీరు నన్ను ఎంతో అభిమానంతో చూస్తున్నారు. మమ్మల్ని యీ జీవితంలో మరువలేను" అందామె.

అతడి చేతులు అమాంతంగా ఆమెను చుట్టేశాయి.

చటుక్కున ఆమె ఎర్రటి పెదిమలను అతను ముద్దెట్టుకున్నాడు.

"ఈ జీవితంలో యిటువైన మనం ప్రేమలో మునిగి తేల్తూ వుంటాం! మన బంధం ఏనాటిదో, దాన్ని ఎవ్వరూ విడదీయలేరు!" అన్నాడతను.

2

అయిదింటికల్లా రామచంద్రమూర్తి ఆ రోజు యింటికొచ్చాడు. తాళం తెరిచి లోపలకు వెళ్ళాడు.

సంవత్సరం నుంచి అతడు ఆ ఫ్లాట్‌లో నివసిస్తున్నాడు. చిన్న హాలు, పక్కనే పడగ్గది, వాటి వెనుక వంటగది, పక్కనే బాత్రూమ్, టాయిలెట్.

ఆరు గంటలదాకా ఆమెకోసం ఎదురు చూశాడతను. ఆమె రాలేదు. ఇంతకు ముందు ఆమె ఆరు లోపల వచ్చేసేది. పెర్సనల్ సెక్రెటరీ అయ్యాక ఎప్పుడు యింటికొస్తుందో వూహాతీతంగా వుంది.

గాస్ స్టవ్ మీద కుక్కర్ పెట్టి అతడు ముందుహాల్లో కూర్చున్నాడు. ఏడు దాటాక యింటిముందు అంబాసిడర్ కారు ఆగింది. ఆమె కిందకు దిగింది. కారు ముందుకు పోయింది.

హాల్లోని పేము కుర్చీలో ఆమె కూర్చుంది. గదిలో లైట్ వెలుగుతోంది. అతడామెవంక నవ్వుతూ చూశాడు.

"ప్రేమా, అలిసిపోయినట్లున్నావు?" అన్నాడతను.

"ఆఫీసు పనంటే ఆడుకోడం కాదు!" అందామె.

"ఎక్కువగా ఆడినా మనుషులు ఆడిపోతారు. వుండు హాట్ కాఫీ తెస్తాను."

"వద్దు, బయల్దేరేముందు తాగాను."

అతడు మళ్ళా కుర్చీలో కూర్చుండిపోయాడు. ఆమె

వంక నవ్వుతూ చూశాడు.

"మీ బాస్ సింగపూర్ నుంచి వచ్చారా?"

"ఇవాళే వచ్చారు" అందామె.

ఆమె వేలిమీదున్న ఉంగరాన్ని అప్పుడు చూశాడతను. డైమండ్ ధగ ధగ మెరుస్తోంది. నకిలీ ఉంగరాన్ని హేండ్ బాగ్ లో వుంచుకుని అసలు వుంగరాన్ని పెట్టుకున్నందుకు ఆమె లోలోపల గాభరాపడింది.

అతడు ఉంగరంవైపే చూస్తున్నాడు.

"ఆ రింగ్ చాలా బాగుంది. ప్రెజెంటా?" అతడు ప్రశ్నించాడు.

ఆమె ఉంగరం తీసి అతడికిచ్చింది.

"దీని వెల ఎంత వుంటుందో చెప్పండి!"

అతడా వుంగరాన్ని యిటూ, అటూ తిప్పిచూశాడు. "సహజ కాంతితో మెరుస్తోంది. నేను వజ్రాలవ్యాపారిని కాను. దీని వెల చాలా వుంటుంది" అన్నాడతను.

"పది రూపాయలిస్తే వెంటనే మీకు అమ్ముతాను" అతడు తృళ్ళిపడ్డాడు.

"అంత తక్కువా?"

"రూపాయిచ్చి రోడ్డుపక్కన అమ్మేవాడి దగ్గర కొన్నాను. ఐదు రూపాయిలు చెప్పి రూపాయికిచ్చాడు" అందామె.

"వాళ్ళంతే!" అన్నాడతను.

ఆమె సంతోషించింది. ఇటువైపు తనకు బెంగలేదు.

ఆమె కుర్చీలోంచి లేచి పడగ్గదిలోకి వెళ్ళింది. వెనుకనే వెళ్ళాడతను. అతడిచ్చిన ఉంగరాన్ని వేలుకు పెట్టుకుంది.

"ఇప్పుడు వంట చేయాలి!" అందామె.

"తంట అయిపోయిందిలే. నువ్వు అలసిపోయి వస్తావని నాకు తెలుసు."

నవ్వుతూ అతడివైపు చూసిందామె. ఆమె బుగ్గలమీద సొట్టలుపడ్డాయి. ఆమె విశాల నేత్రాలు తళతళ మెరుస్తున్నాయి.

"ప్రేమా!" అని అతడామెను కౌగలించుకున్నాడు.

ఉద్రేకంతో ఆమెను పదే పదే ముద్దెట్టుకున్నాడు.

"ఉండండి, బట్టలు మార్చుకోవాలి" అందామె.

అతడు మంచంమీద కూర్చున్నాడు. ఆమె దుస్తులు కింద పడుతున్నాయి. అతడు ఆమెవైపే చూస్తున్నాడు.

తటాలున లైట్ ఆరిపోయింది. కాస్సేపట్లో ఆమె మేక్సీలో వుంది. మళ్ళా లైట్ వెల్గింది. అతడిని చూసి ఆమె చిలిపిగా నవ్వింది.

"దొంగా, లైట్ ఆర్పేసి మళ్ళీ స్విచ్ నొక్కావా?" అన్నాడతను.

"దొంగతనంగా చూసేవాళ్ళకు అదే శిక్ష!" అంది ప్రేమ.

రామచంద్రమూర్తి ఆలోచిస్తున్నాడు. వాళ్ళ పెళ్ళయి సంవత్సరం దాటింది. అప్పుడప్పుడు సరదాగా పోట్లాడుకున్నా జీవితం సుఖంగా సాగిపోతోంది. మొదట్లో తనకంటె తక్కువ సంపాదించే ప్రేమ ఇప్పుడు తన జీతానికి రెట్టింపు గడిస్తోంది.

దేనికీ లోటులేదు. ఆమె మాటలు విని అతడు ఆలోచనల్లోంచి తృళ్ళిపడ్డాడు.

"గుడ్ న్యూస్!" అందామె.

ఆమెవంక ప్రశ్నార్థకంగా చూశాడతను.

"కంపెనీ మనకు ఫోన్ యిస్తుంది. ఫోన్ బిల్లు కంపెనీ చెల్లిస్తుంది."

"ప్రేమా, నువ్వు బాగా పెరిగిపోతున్నావు. నేను గొంగళిలా వేసినచోటే పడున్నాను. ఎదుగూ బొదుగూ లేదు!" అన్నాడతను దీనంగా.

అతడివంక ఆమె సూటిగా చూసింది.

"మనిద్దరిలో ఎవరో ఒకరు వృద్ధిలోకి రావడం మంచిదేగా!" అందామె.

"ఆ, మంచిదే. మనలో మార్పులు రానంతకాలం!" అన్నాడతను.

"ఏమిటి మీరనేది?"

"ఏమీ లేదులే! ఆకలిగా వుంది. భోజనం చేద్దాం పద" అన్నాడతను.

3

ధనంజయరావు కుషన్డ్ కుర్చీలో వెనక్కు వాలి కలలు కంటున్నాడు. మొదట్లో కొంత అభ్యంతరం చెప్పినా ప్రేమ పూర్తిగా తనదైంది.

ఈసారి ఆమెను తనతో లండన్ న్యూయార్క్ నగరాలకు తీసుకువెళ్ళాలి! కాని తన భార్య రాధ ఒప్పుకుంటుందా?

తలుపు తోసుకుని ప్రేమ లోపలకు వచ్చింది. అతడి దగ్గరగా వెళ్ళి చూస్తూ నిలబడింది.

"మన ఆఫీసులో నాయర్ అనేవాడున్నాడు. మనల్ని అతను రహస్యంగా గమనిస్తున్నాడు" అందామె.

"వాడా, గోపాల నాయరా?" అన్నాడు ధనంజయరావు.

అతడి కెదురుగా ఆమె కూర్చుంది. ధనంజయరావు

ఆలోచించి అంతా గ్రహించాడు.

గోపాలనాయర్ చిన్నతనంలో తనింట్లో నౌఖరుగా వుండేవాడు. అప్పటినుంచీ అతను తన భార్యకు బాగా తెలుసు. ఎన్నో కంపెనీలు పెట్టాక నాయర్‌ని తనే కంపెనీకి బదిలీ చేశాడు. తను ఏం చేస్తున్నదీ గమనించమని రాధ అతడిని నియమించి వుంటుంది.

తనకూ, ప్రేమకూ వున్న బంధం గురించి నాయర్ తెల్సుకుంటాడు. తన భార్యతో చెప్తాడు. అతడిని ఆపాలి!

ధనంజయరావు ఆమెవైపు చూశాడు.

"ప్రేమా, డోంట్ బాదర్. నాయర్ చాలా చిన్న చేప. మన్ని ఏమీ చేయలేడు."

"చూడండి, నేను పెళ్ళయినదాన్ని. మీకు భార్య వుంది. మనల్ని గురించి ఏదేనా దుష్ప్రచారం జరిగితే తలెత్తుకు తిరగడం కష్టం" అందామె.

"నాయర్‌తో నేను మాట్లాడుతాను" అన్నాడతను.

ఆ నాటి రాత్రి తొమ్మిది ప్రాంతంలో గోపాల నాయర్ రైలుపట్టాలకు పక్కనే వున్న రోడ్డుమీద ఒక చోట నిలబడి వున్నాడు. తన బాస్ కారుకోసం ఎదురు చూస్తున్నాడు.

9-30 కి బాస్ కారు వచ్చి అతడి పక్కనే ఆగింది. నాయర్ అతడికి వినయంగా నమస్కరించాడు.

"నువ్వు వస్తావో రావో అనుకున్నాను!" అన్నాడు ధనంజయరావు.

"అదేమిటి సార్? ఇరవైయేళ్ళపైగా మీ దగ్గర పనిచేస్తూ రాకుండా వుంటానా?"

కారు వెనుక సీటువైపు చూశాడు ధనంజయరావు.

అక్కడున్న ఇద్దరు మనుషులు కిందపడిగారు. వాళ్ళిద్దరూ గూండాల్లా వున్నారు.

సీటుమీద కూర్చుని ధనంజయరావు లైటర్‌తో సిగరెట్ వెలిగించాడు. నాయర్ వైపు నవ్వుతూ చూశాడు.

"నాయర్, పట్టాలకు అటువైపున నా శత్రువు ఒకడున్నాడు. అతడు నన్ను ముప్పతిప్పలూ పెడుతున్నాడు. ఈ యిద్దరితో నువ్వు వెళ్ళి అతడిని ఇక్కడకు తీసుకురా. అతడికి ఏం కావాలో కనుక్కుని యిచ్చేద్దాం. అతడి యిల్లు నీకు చూపిస్తారు" అన్నాడతను.

"అలాగే సార్!" అన్నాడు నాయర్.

నాయర్, వెనకనే వాళ్ళిద్దరూ పట్టాలవైపు కదిలారు. అప్పుడే వస్తూన్న ఎలక్ట్రిక్ ట్రెయిన్ హెడ్ లైట్ కాంతి వాళ్ళమీద పడింది.

"ఎందుకీ తొందర! ట్రెయిన్ పోయాక పట్టాలు దాటుదాం" అన్నాడతడు.

"అదే మంచిది" అన్నాడు రెండోవాడు.

వాళ్ళ మాటలు విని నాయర్ ఆగాడు. ఇద్దరూ అతడి వెనుకనే నిలబడ్డారు. ట్రెయిన్ దగ్గర కొస్తోంది.

ధనంజరావు కారును స్టార్టుచేసి గేరులో వుంచాడు. అమాంతంగా వెనుక నిలబడిన వాళ్ళిద్దరూ నాయర్‌ని పట్టాలమీదకు బలంగా తోశారు. శబ్దం చేస్తూ ట్రెయిన్ దూసుకుపోయింది. భయానకమైన నాయర్ అరుపులు చీకట్లో ధ్వనించాయి.

గూండా లిద్దరూ చీకట్లో పారిపోయారు. ధనంజయ రావు కూర్చున్న కారు రోడ్డుమ్మట దూసుకుపోయింది.

హఠాత్తుగా ట్రెయిన్ ఆగింది.

ఆమె టైం చూసింది. రామచంద్రమూర్తి ఆమెవైపు చూస్తున్నాడు.

"ప్రేమా, యింత రాత్రివేళ వెళ్ళాలా?" ప్రశ్నించాడతను.

"రేపు ఇటలీనుంచి స్కూటర్ ఫాక్టరీవాళ్ళు వస్తున్నారు. వాళ్ళ సహకారంతో యిక్కడ ఒక స్కూటర్ల ఫాక్టరీని ధనంజయరావుగారు స్థాపిస్తున్నారు. ఇవాళ రాత్రి మా ఆఫీసులో అందరూ పని చేస్తున్నారు. వెళ్ళక తప్పదు" అందామె.

టైమ్ పది కావస్తోంది. ఇంటిముందు కారు ఆగింది. ఆమె భర్తకు చెప్పి బయటకు వెళ్ళింది. కారులో కూర్చుని తలుపు మూసింది. కారు వెంటనే వెళ్ళిపోయింది.

కారులో ఎవరున్నారో రామచంద్రమూర్తి స్పష్టంగా చూడలేకపోయాడు.

కారును పోనిస్తున్న ధనంజయరావు ఆమె చేయిని పట్టుకుని నిమిరాడు. అతడికి దగ్గరగా జరిగి ఆమె కూర్చుంది.

"నాయర్ యిటుపైన మనవైపు చూడడు. మనల్ని గురించి ఎవ్వరితోనూ మాట్లాడడు!" అన్నాడతను.

ఆమె అతడి చెయ్యిని నిమిరింది.

"ఈ మధ్య నా భర్తకి అనుమానం ఎక్కువవుతోంది. యివాళ నేనిలా రావడం ఆయన కిష్టం లేదు" అందామె.

అతడు కారును మెల్లిగా పోనిచ్చాడు.

"ప్రేమా, నే నింతవరకూ యెవ్వరినీ ప్రేమించలేదు. నిన్ను చూశాక ప్రేమ అంటే ఏమిటో నాకు అర్థమైంది. నువ్వు తప్ప మరెవ్వరికీ నా హృదయంలో స్థానం లేదు" అన్నాడతను వుద్రేకంతో.

ఆమె అతడికింకా దగ్గరగా జరిగింది.

"నీ కోసం ఒక మేడ తీసుకున్నాను. నువ్వూ, నీ భర్తా వెంటనే అక్కడకు మారొచ్చు. అక్కడకు వెళ్ళి చూద్దామా?"

"పదండి చూద్దాం?" అందామె.

ఆమె ఆలోచిస్తోంది. తను పేదరికంలో పుట్టింది. చిన్నప్పుడు ధరించడానికి మంచి దుస్తులు లేవు. తండ్రి మరణించాడు. తండ్రి కొచ్చిన కొద్ది డబ్బుతో తల్లి యిల్లును నడిపేది. ఎలాగో ఆమె బి. ఎ. పాసయింది. అమ్మ పోయింది. మావయ్య యింటికి ఆమె చేరుకుంది.

మావయ్య యిల్లు ఆమెకు నచ్చలేదు. అత్తయ్య గోగి పెట్టిది. మావయ్య చూపు ఎప్పుడూ తనమీదే వుండేది. మరి కొంతకాలం అక్కడుంటే మావయ్య కామానికి తను బలై పోవలసినది!

ఆ సమయంలో రామచంద్రమూర్తి ఆమెను బస్ స్టేండ్‌లో చూశాడు. ప్రేమించాడు. వెంటనే అతడిని పెళ్ళాడి బయటపడింది.

ఇదంతా ఆమె సింహావలోకనం చేసుకుంటోంది. గేటు దాటి లోపలకు దూసుకెళ్ళి పోర్టికోలో కారు ఆగింది.

ఒక గూర్ఖా వినయంగా వచ్చి యిద్దరికీ నమస్కరించాడు.

ధనంజయరావు, ప్రేమ కిందకు దిగారు. అతడు

ముందు తలుపుకున్న గాడ్ రెజ్ తాళం తెరిచాడు. ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

అతడు స్విచ్ లు నొక్కాడు. రెండు ఫ్లోరసెంట్ లైట్లు ప్రకాశవంతంగా వెల్గాయి.

పెద్ద హాలు. మొజయిక్ ఫ్లోరింగ్ మెరుస్తోంది. మధ్యలో ఖరీదయిన రోజ్ వుడ్ సోఫాలున్నాయి. సోఫాల పక్కన వాల్ నట్ వుడ్ టీపాయిలు.

కింద చాలా గదులున్నాయి. ఇద్దరూ మెట్లెక్కి పైకెళ్ళారు. ఏర్ కండిషండ్ పడగ్గది. గదిలో చల్లగా వుంది. డబుల్ స్ప్రింగ్ కాట్. పైన ఫోమ్ బెడ్. గోడలకు అందమైన పెయింటింగ్స్ వేళ్ళాడుతున్నాయి. ఒక వైపున గోడలో అమర్చిన వార్డ్ రోబ్. ఇదంతా ఏదో కలలో చూస్తున్నట్లు ఆమె నలువైపులా తిలకిస్తోంది.

"దీనికి అద్దె ఎంత?" అడిగిందామె యటాచ్డ్ బాత్ రూమ్ని చూస్తూ.

ధనంజయరావు గంభీరంగా నవ్వాడు.

"నీ యింటికి నువ్వు అద్దె యిచ్చుకోడం ఏమిటి? ఈ యింటి టైటిల్ డీడ్స్ నీ పేర వున్నాయి. ఇది నీ ఇల్లు."

ఆమె గుండె దడదడలాడింది. అతడు చెప్పింది నిజమా? ఇంత పెద్ద యిల్లు తనదా?

అమాంతంగా ఆమె అతడిని కౌగలించుకుని, పెదిమలను బలంగా, వుద్రేకంతో ముద్దెట్టుకుంది. ఆమెను మెల్లిగా తీసుకెళ్ళి అతడు పరుపుమీద పడుకోబెట్టాడు. ఆ క్షణంలో ఆనందం ఆమె హృదయంలోంచి పొంగి, శరీరాన్ని ఆవరించి, కళ్ళలో మెరుస్తోంది. ఆమెవైపు చూస్తూ పక్కనే కూర్చున్నాడతను.

పరుపుమీద ఆమె వెల్లకిలా పడుకుంది. మోకాళ్ళ

పైకి వున్నాయి. ఆమె పాదాలవైపు చూశాడతను. చిన్న పాదాలు. బంగారం ముద్దలా వున్నాయి. ఆమె పాదాన్ని మెల్లిగా పట్టుకున్నాడు. ఆమె లేచి కూర్చోబోయింది.

"అలాగే పడుకో!" అన్నాడతను.

ఆమె తీయగా నవ్వింది.

"ఈ యిల్లు చూసి నా భర్త ఏమనుకుంటాడు?"

అతడు వెంటనే జవాబివ్వలేదు. ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు.

"నేనేదేనా చెయ్యదలిస్తే అది చేసుకుపోతాను. ఎవరు ఏమనుకుంటారని బాదర్ అతను, ఎవరేనా అడ్డొస్తే వాళ్ని తొలగిస్తాను!" అన్నాడతను. ఆమె మౌనంగా విన్నది.

"ప్రేమా, నీ భర్త ఒక చిన్న కంపెనీలో ఆటో మొబైల్ పార్ట్స్ సేల్స్ మాన్‌గా వుంటున్నాడు. అతడితో నీకు భవిష్యత్తు లేదు. నా భార్యకూడా అంతే. ఒక పరిస్థితిలో ఆమెను నేను పెళ్ళాడాను. కాని ఆమె మీద నాకు ప్రేమలేదు. నీతో వుంటే చంద్రకాంతిలో విహరిస్తున్నట్లు వుంటుంది. అటువంటి అనుభూతులను నేను నా భార్యనుంచి పొందలేను. మన కలయికను వాళ్ళు ఒప్పుకోవాలి. మనకు అడ్డొస్తే వాళ్ళను తొలగించాలి!"

గదిలో నిశ్శబ్దంగా వుంది. తనకోసం ఎంతమందినేనా అతడు తొలగిస్తాడు. ఎంత ప్రేమ! అతడి ప్రేమను వూహించుకుని ఆమె లోలోపల భయపడింది.

మెల్లిగా అతడామె చెయ్యిని పట్టుకున్నాడు. ఆమె వైపు ఆప్యాయంగా చూశాడు.

"నా మాటలను మరోవిధంగా అర్థం చేసుకోకు! ఈ జీవితంలో నిన్ను నేను వదలను."

ఆప్యాయంగా ఆమె చెయ్యి నొక్కి ముందుకు వాలాడు. ఆమెను ముద్దెట్టుకున్నాడు. ఆమె చేతులు అతడిని బలంగా చుట్టేశాయి.

మరో అరగంట తర్వాత ఇద్దరూ కిందకు దిగారు. ముందు తలుపుకు అతడు తాళంవేసి తాళంచెవుల గుత్తిని ఆమెకిచ్చాడు.

ఇద్దరూ కార్లో కూర్చున్నారు. అతడు కారును గేటు దాటి బయటకు పోనిచ్చాడు.

5

పడగ్గదిలో ఫ్లోరసెంట్ లైట్ వెల్గుతోంది. తలుపు తోసుకుని పక్క గదిలోంచి రాధ వేగంగా అతడి మంచం దగ్గరకు వెళ్ళింది.

అతడామెవైపు విసుగ్గా చూశాడు.

"ఏం కావాలి?" అడిగాడతను.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"ఎంతో డబ్బు గడిస్తున్నావు. ఫాక్టరీమీద ఫాక్టరీ స్థాపిస్తున్నాయి, కాని లోలోపల మనో్యక శాంత కడవు" అర్చిందామె.

అతడు విచిత్రంగా నవ్వాడు.

"రాధా, నా భార్యగా నువ్వీ భవనంలో సుఖంగా పడున్నావు. కిల్లర్ యిన్ స్టింక్టు వుంటేగాని యీ లోకంలో ఎవరూ అఖండ విజయాన్ని సాధించలేరు. వింబల్డన్ టెన్నిస్ పోటీల్లో నెగ్గాలంటే అది వుండాలి. వ్యాపారంలో జయించాలంటే అది కావాలి. అది నాలో వున్నందువల నే యింతగా నెగ్గుకొచ్చాను."

"సాయంత్రం పేపరు చూశావా?" అడిగిందామె.

"నా కంపెనీల షేర్ల విలువ యింకా పెరిగిందా?"

"ఎలక్ట్రిక్ ట్రెయిన్ క్రింద ఒకతనుపడి మరణించాడు. అతడి పేరు గోపాల నాయర్. నీ కంపెనీలో పనిచేసే మనిషి!" అందామె.

"పూర్ ఫెలో! అతడికేమైంది?"

"పట్టాలు దాటుతూంటే అమాంతంగా ట్రెయిన్ వచ్చేసుండాలని పోలీసులు భావిస్తున్నారు. కాని నాయర్ అంత ముసలివాడు కాదు. అతడు ప్రమాదవశాత్తూ మరణించి వుండడు. అతడిని యెవరో హత్యచేసి వుండాలి" అందామె.

"నాయర్‌లాంటి అనామకుడిని చంపవలసిన అవుసరం ఎవరికి పడ్తుంది?"

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"ఆనాడు రంగరాజు ఏమయ్యాడు?" అందామె.

ఆ ప్రశ్న వినగానే అతడి మెదడు గతంలోకి దూసుకుపోయింది.

రంగరాజు రాజా షుగర్ మిల్స్ మేనేజింగ్ డైరెక్టర్. ఆ ఫాక్టరీని కొనడానికి తను ఎంతగానో ప్రయత్నించాడు. కాని రంగరాజు లొంగలేదు. అతడు వున్నంతకాలం ఫాక్టరీ తన చేతుల్లోకి రాదు.

ఆ రోజు రాత్రి హోటల్ మిలన్ ఐదో అంతస్తులో వున్న రూఫ్‌గార్డెన్‌లో బుఫేకమ్ డ్రింక్ పార్టీ సాగుతోంది.

పార్టీలో ఒక మంత్రి కూడా వున్నాడు. నూరు మంది పైన అతిథులు వున్నారు.

రంగరాజూ, తనూ స్కాచ్ విస్కీ సేవిస్తూ మాట్లాడు

కుంటున్నారు.

"మీ ఫ్యాక్టరీ అమ్మనని మీరు అన్నందుకు నేను చాలా సంతోషిస్తున్నాను," అన్నాడతను.

"నన్ను అర్థం చేసుకున్నారు, థాంక్స్" అన్నాడు రంగరాజు.

విస్కీతో నిండిన గ్లాసులు పట్టుకుని తనూ, రంగరాజూ పిట్టగోడ పక్కనే నిలబడ్డారు. తను కిందకు చూశాడు. అక్కడ ఆగివున్న కార్లు కనిపిస్తున్నాయి.

వాళ్ళ చేతుల్లోని గ్లాసులు ఖాళీ అయ్యాయి. తను విస్కీ బాటిల్ తీసుకుని రెండు గ్లాసుల్లోనూ మళ్లా నిండుగా పోశాడు.

రంగరాజు కొద్దిగా తూలుతున్నాడు. అది తను గమనించాడు. నలువైపులా చూశాడు. ఎవ్వరూ తనువైపు చూడ్డంలేదు.

అమాంతంగా తను రంగరాజును పిట్టగోడమీదనుంచి బయటకు నెట్టేశాడు. పక్కకు తిరిగి చూశాడు. ఒక యువతి తనవైపు చూస్తోంది. ఆమె జరిగింది గమనించి వుంటుంది.

తను వేగంగా ఆ యువతి పక్కకు జరిగాడు.

"నువ్వు నా భార్యవు కాబోతున్నావు. నిన్ను నేను వెంటనే పెళ్ళాడ్తాను. నన్ను కాపాడు!" అన్నాడు తగ్గు స్వరంలో.

"ఒప్పుకుంటున్నా" అందామె.

రంగరాజు కిందపడి మరణించాడు. తర్వాత ఆ ఫ్యాక్టరీని తను కొనేశాడు.

ఆ పరిస్థితుల్లో తను పెళ్ళి చేసుకున్న యువతే తన భార్య రాధ!

అతను కనురెప్పలు చిట్లిస్తూ ఆమెవైపు చూశాడు.

"రాధా, రంగరాజు ఏమయ్యాడో నువ్వు చూశావు. కాని నాయర్ విషయం నువ్వు చెప్పినదాకా నాకు తెలియదు" అన్నాడతను.

"నువ్వు ఎప్పుడూ నిజం చెప్పవు. నాయర్ నాకు ఫోన్ చేసి మాట్లాడాడు. నిన్న రాత్రి అతడిని ఆ రైలు పట్టాల ప్రాంతంలో నిలబడమని నువ్వు చెప్పావట. అక్కడకు తొమ్మిది తర్వాత, పట్టాల పక్కన అతడిని నువ్వు ఎందుకు కలుసుకోవలసి వచ్చింది?" అడిగిందామె.

ధనంజయరావు జవాబివ్వ లేదు. నాయర్ తన భార్యకు ఫోన్ చేయెచ్చు అనేదాన్ని గురించి అతడు ముందుగా ఆలోచించలేకపోయాడు.

రాధ దేవాంతకరాలు! ఆనాడు రంగరాజుకి జరిగింది చూసింది. నిన్న రాత్రి నాయర్ని తను అక్కడ వుండ మన్నది ఆమెకు తెలుసు. అతడి మెదడులో తీవ్రంగా ఆలోచనలు సాగుతున్నాయి.

"అక్కడ వుండమన్నాను. కాని మరో పనిలో మునిగిపోయి దాని విషయమే మర్చిపోయాను" అన్నా డతను.

రాధ వెటకారంగా నవ్వింది.

"నీది చాలా మెథాడికల్ గా నడిచే బుర్ర. నువ్వు ఏ విషయం మర్చిపోవు! నాయర్ పట్టాల దగ్గరకు వెళ్ళి నీకోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు. అదే రాత్రి ట్రెయిన్ కిందపడి చచ్చాడు. రంగరాజు పిట్టగోడమీద నుంచి కిందపడ్డాడు. నాయర్ పట్టాలమీద పడి ట్రెయిన్ చక్రాల కింద నలిగిపోయాడు. ఆనాడు రంగరాజును తోసినట్లే నువ్వు ఏదో చేసుంటావు!"

ధనంజయరావు లోలోపల గాభరాపడినా పైకి ప్రదర్శించకుండా జాగ్రత్తపడ్డాడు.

"నువ్వు అలా అనుకుంటే నేనేమీ చెయ్యలేను."

రాధ అతడి పక్కనే కూర్చుంది.

"మీ ఆఫీసులో పనిచేసే ప్రేమతో నువ్వు ఆడే నాటకం ఏమిటి?" అడిగిందామె.

"అదంతా నాయర్ చెప్పాడా?"

"చెప్పాడు. నిన్ను ఒక కంటితో చూస్తూవుండమని నాయర్‌కి నేను చెప్పాను. అది నువ్వు గ్రహించి వుంటావు. అతడిని నీ తోవలోంచి తొలగించావు!"

"కావచ్చు!" అన్నాడతను.

"రంగరాజు, నాయర్! వాళ్ళను గురించి నేను మాట్లాడితే నీకు ప్రమాదం. నేను చెప్పింది నువ్వు వెంటనే చెయ్యాలి! ప్రేమ నీ కంపెనీలో వుండకూడదు. ఆమెను పొమ్మను! ఆమెను నువ్వు మళ్ళీ ఎప్పుడూ కలుసుకోకూడదు!"

"అలా చెయ్యకపోతే?"

"రంగరాజు ఎలా మరణించాడో బయటపడుతుంది. నాయర్‌కి ఏమైందో తెలుస్తుంది."

"రంగరాజు హత్య విషయం యింతకాలం దాచిపెట్టినందుకు నువ్వు నాతో యిరుక్కుంటావు!" అన్నాడతను.

"నేను ఏమయినా ఫరవాలేదు. నిన్ను నాశనం చేస్తాను. ఈనాడు అనేకమంది నిన్ను గొప్ప పారిశ్రామికవేత్తగా భావిస్తున్నారు. నీ నిజరూపాన్ని వాళ్ళకు చూపిస్తాను. నీ మొహంమీద అందరూ ఉమ్మేస్తారు!"

అతడు లేచాడు. టేబుల్‌మీదున్న స్కాచ్ విస్కీని

ఒక గ్లాసులో పోసుకుని, సోడా కలిపాడు. తాగుతూ ఆమెవైపు చూశాడు. అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి.

"రాధా, నువ్వు చెప్పినట్లు చేస్తాను. ప్రేమను పంపించేస్తాను. నాకు రెండు వారాలు టైము కావాలి."

"రెండు వారాలు టైము యిస్తున్నాను. ఈ గడువు యింక పొడిగించబడదు!"

అతడు గ్లాసులోని విస్కీని తాగేసి మళ్ళా పోసుకున్నాడు.

అతడివైపు అదోలా చూస్తూ రాధ తన గదిలోకి వెళ్ళిపోయింది.

విస్కీ తాగుతూ అతడు పరుపుమీద కూర్చున్నాడు. అతడి మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. రంగరాజునీ, నాయర్ని తొలగించినట్లే తను రాధను తన బాటనుంచి తొలగించాలి!

రాధ చావాలి! రెండు వారల్లో ఆమె మరణించాలి!

6

హేండ్ బాగ్ లోని నకిలీ ఉంగరాన్ని పొరబాటున వేలుకి పెట్టుకుని ప్రేమ ఆఫీసుకు వెళ్ళిపోయింది.

ఆమె హేండ్ బాగ్ లో వున్న మరో ఉంగరాన్ని రహస్యంగా తీసి రామచంద్రమూర్తి జేబులో దాచుకున్నాడు.

ఆమె వెళ్ళిపోగానే అతడు యింటికి తాళంవేసి బయటకు నడిచాడు.

ఆమె హేండ్ బాగ్ లో ఒకేరకమైన రెండు ఉంగరాలు వుండడం అతడు గమనించాడు. ఒక వుంగరాన్ని ఆమె తనకు చూపించి, ఒక రూపాయి యిచ్చి కొన్నానని

చెప్పింది. ఈ రెండో వుంగరం ఆమె బాగ్‌లో ఎందుకు వుంది?

బస్ స్టేండ్ వైపు నడుస్తూ అతడు ఆలోచిస్తున్నాడు. రెండో వుంగరాన్ని తనకోసం కొని ఆమె యివ్వడం మర్చిపోయిందా?

అతడు బస్సు ఎక్కాడు. అరగంట ప్రయాణం చేసి ఒకచోట దిగాడు. పాపాలాల్ అండ్ కంపెనీ బోర్డు చూసి అతడు మెట్లెక్కి పైనున్న షాపులోకి వెళ్ళాడు.

ప్రొప్రయిటర్ పాపాలాల్ అతడిని నవ్వుతూ ఆహ్వానించాడు.

"ఏం కావాలి సార్?" అన్నాడు పాపాలాల్.

రామచంద్రమూర్తి జేబులోంచి వుంగరం తీశాడు.

"దీని విలువ ఎంత వుంటుందో చెప్పగలరా?" అడిగాడతను.

పాపాలాల్ ఉంగరాన్ని తీసుకుని పరీక్షగా చూశాడు.

"ఇది చాలా ఖరీదైనది, సార్" అన్నాడతను.

"ఎంతకి కొనచ్చు?"

"లక్షపైన కళ్ళు మూసుకుని యివ్వొచ్చు."

రామచంద్రమూర్తి గుండె స్థంభించిపోయినట్లు అయింది. అతడు మెల్లిగా తేరుకున్నాడు.

"మీరు కొంటారా?"

పాపాలాల్ అతడివైపు సూటిగా చూశాడు.

"ఇది మీదని రుజువు చేయగల్గితే మేం తప్పక కొంటాం."

"మీరు ఎంత యిస్తారు?"

"లక్షా పదివేలు యిస్తాం."

రామచంద్రమూర్తి వుంగరాన్ని తీసుకుని జేబులో పడేసుకున్నాడు.

"అంత ఖరీదైన వుంగరం జేబులో పెట్టుకుని తిరక్కండి. ఎవరేనా కొట్టేస్తారు!" పాపాలాల్ హెచ్చరించాడు.

రామచంద్రమూర్తి మెట్లు దిగి పేవ్‌మెంటుమీద నడవసాగాడు. ప్రేమ యీ వుంగరాన్ని రూపాయికి కొన్నానంది. కాని దాని ఖరీదు లక్షా పదివేలు!

అంత ఖరీదైన వుంగరం ప్రేమకు ఎలా వచ్చింది? ఎవరిచ్చారు?

అతడు ఆఫీసుకు వెళ్ళలేదు ఇంటికి పోయి పడుకుని ఆలోచించసాగాడు. గతం గుర్తొచ్చింది.

బస్‌స్టేండులో అతడు ఆమెను చూశాడు. ఆమె అతడికి నచ్చింది. పెళ్ళి చేసుకుంటానని అన్నాడతను. ఆమె మావయ్యతో మాట్లాడి అంతా నిశ్చయం చేశాడు. నెల తిరిగేలోగా అతడితో ఆమె పెళ్ళి అయిపోయింది.

పెళ్ళయినాక ఆమెతో అతడు మద్రాసులో కాపురం పెట్టాడు. అతడికొచ్చే కొద్ది జీతంతో జీవితం సాగిపోతోంది.

తను కూడా ఉద్యోగం చేస్తానని అందామె. ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేయడం మంచిదని అందామె. అతడు ఒప్పుకున్నాడు.

తనకొచ్చే 600కి ఆమె జీతం కలిపితే యింకా బాగా జీవించవచ్చని అతడు ఆశించాడు.

ధనంజయరావు కంపెనీలో 300 జీతంమీద ఆమె టైపిస్టుగా చేరింది. రెండు నెలల్లో ఆమె బాస్‌కి టైపిస్టు అయింది. ఆమె జీతం 750కి పెరిగింది.

ఆరు నెలల్లో ఆమె యింతా పెరిగిపోయింది. బాస్‌కి పెర్సనల్ సెక్రటరీ అయింది. ఆమె జీతం రెండువేలు అయింది.

ఆఫీసు కారు పొద్దుటే వచ్చి ప్రేమను తీసుకు వెళ్తుంది. రాత్రి ఆఫీసు కారు ఆమెను యింటిముందు దింపుతుంది.

అంతేకాదు. లక్షరూపాయలు పైన విలువ చేసే డైమెండ్ రింగ్! ఆమెకు కంపెనీ పెద్ద యిల్లు కూడా యివ్వబోతోంది.

అతడి బుర్ర ఆలోచనల్తో వేడెక్కుతోంది. ఆమెను మనస్ఫూర్తిగా అతడు ప్రేమించాడు. ఇంత వేగంగా తారాజువ్వలా ఆమె పైకి ఎలా ఎగరగల్గింది?

నాలుగేళ్ళ పైగా అతడు సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. కాని ఒక మెట్టు కూడా పైకి వెళ్ళలేక పోయాడు.

ప్రేమ తనకు ద్రోహం చేస్తోందా? తనకు తెలియకుండా ధనంజయరావుతో ఆమె అక్రమ సంబంధాన్ని ఏర్పర్చుకుందా?

పెళ్ళికి ముందు ఎంతో అమాయకంగా వుండే ప్రేమలో ఎంత మార్పు! ఆమె సృష్టించిన ప్రవాహంలో తను కాగితం పడవలా కదిలి పోవలసి వస్తోంది!

ఆలోచించి, అలిసిపోయి అతడు నిద్రపోయాడు. భోజనం కూడా చేయలేదు.

ఎవరో తలుపును తట్టారు. అతడు మేలుకొని లేచాడు. గదిలో చీకటి!

అతడు లైట్ స్విచ్ నొక్కాడు. లైట్ వెల్గింది. అతడు చాలాసేపు పడుకుని వుండాలి. మెల్లిగా వెళ్ళి

తలుపు తెర్చాడు.

ప్రేమ హాల్లోకొచ్చింది. అలసటగా ఆమె పేము కుర్చీలో కూర్చుంది.

"కాఫీ తేనా?" అన్నాడతను.

ఆమె అతడివైపు సూటిగా చూసింది.

"ఏమిటి అలా వున్నారు?" అందామె.

"ఒంట్లో ఎలాగో వుంది. ఎక్కువగా నిద్రపోయాను. మరేం ఫరవాలేదు" అన్నాడతను.

"కంపెనీ యిచ్చిన యింటికి రేపు మారిపోదాం" అందామె.

"అలాగే మారుదాం" అన్నాడతను.

ఆమె కుర్చీలోంచి లేచి అతడి దగ్గరకు వచ్చింది.

"మీరు మొహం కడుక్కురండి. కొంచెం విశ్రాంతి తీసుకుంటే మీ ఆరోగ్యం బాగుపడుతుంది" అందామె.

అతడు జవాబివ్వలేదు. లోపలకు వెళ్ళాడు. చన్నీళ్ళతో మొహం కడుక్కున్నాడు.

పడగ్గదిలోకి వెళ్ళి తువ్వాలుతో మొహం తుడుచుకున్నాడు.

ఆమె దుస్తులు మార్చుకుంటోంది. ఆమెవైపు అతడు చూడలేదు.

హాల్లో వున్న పేము కుర్చీలో కూర్చున్నాడు. సిల్కు మేక్సీ ధరించి ఆమె హాల్లోకొచ్చింది.

"ఇదెలాగుంది?" అందామె.

"చాలా బాగుంది" అన్నాడతను.

"బాస్‌కి గార్మెంట్స్ ఫాక్టరీ వుంది. అక్కడ యిది కుట్టబడింది. ఆఫీసులో పనిచేసే వాళ్ళకు యివి తక్కువ ధరకు యిస్తారు" అందామె.

"ఎంతకిచ్చారు?"

"పదిరూపాయలు" అందామె.

"డామ్ చీప్!" అన్నాడతను.

"మీకోసం రెండు టీ షర్టులు తెచ్చాను" అని ఆమె పడగ్గదిలోకి వెళ్ళింది.

పోలిథీన్ కవర్లలో వున్న రెండు టీ షర్టులను అతడికిచ్చింది.

"బాగున్నాయి!" అన్నాడతను.

"వేసుకు చూడండి! సైజు కుదరకపోతే రేపు మార్చి తెస్తాను" అందామె.

"రేపు వేసుకుచూస్తానులే" అన్నాడతను నిర్లిప్తంగా.

7

ధనంజయరావు టైము చూశాడు. పన్నెండు దాటింది. గదిలో ఫ్లోరసెంట్ లైట్ వెలుగుతోంది.

అతడు డ్రాయర్ లాగి అందులో వున్న సిరంజిని తీశాడు. ఇన్సులిన్ని సిరంజిలోకి ఎక్కించాడు. మెల్లిగా రాధ గది ముందుకు వెళ్ళాడు.

లోపలనుంచి ఆమె తలుపు వేసుకోలేదు. తలుపుతోసి అతడు లోపలకు వెళ్ళాడు.

జీరోవాట్ బల్బు వెలుగుతోంది. రాధ నిద్రపోతూ వుండాలి!

అతడు స్విచ్ నొక్కాడు. గదిలోని లైట్ వెలిగింది. అతడు పరుపువైపు నడిచాడు. అతడు వూహించినట్లే ఆమె నిద్రపోతోంది.

మెల్లిగా సూదిని ఆమె చేతిలోకి పోనిచ్చాడు. వులిక్కిపడ్తూ ఆమె కళ్ళు తెర్చింది. చేత్తో సిరంజిని తోయడానికి యమ ప్రయత్నం చేసింది.

అతడామె చెయ్యిని మోకాల్తో నొక్కిపెట్టాడు. ఇంజక్షన్ సూదివున్న చెయ్యిని ఆమె కదిల్చింది. కాని అప్పటికప్పుడే యిన్సులిన్ ఆమెలోకి ప్రవహించింది.

అతడు సిరంజిని లాగేశాడు. ఆమె లేచి కూర్చుంది. అతడివైపు చూసింది.

"నాకు ఏమిటి యింజెక్షన్ యిచ్చావు?" ప్రశ్నించిందామె.

అతడు క్షోళనగా నవ్వాడు.

"నీ ఆరోగ్యం బాగాలేదు! హాయిగా నిద్రపో!" అన్నాడతను.

ఇన్సులిన్ మూలంగా ఆమె రక్తంలోవుండే షుగర్ తగ్గిపోయింది. ఆమె అతడివైపు చూస్తోంది. కాని చూపు సరిగ్గా ఆనడంలేదు. కళ్ళు తిరుగుతున్నాయి.

ఆమె వెనక్కుపడి నిద్రపోయింది. ఆమె నాడిని అతడు పరిశీలించాడు.

రాధ తనకు రెండు వారాలు గడువు యిచ్చింది. రెండు వారాల్లో ఆమె పైకి ఎగిరిపోవాలి!

అతడు స్విచ్ ఆఫ్ చేసి తన గదిలోకి వచ్చాడు. సిరంజిని డ్రాయర్లో దాచేశాడు.

గ్లాసులో స్కాచ్ విస్కీ పోసుకుని సోడా కలిపాడు. తాగుతూ పడగదిలోని సోఫాలో కూర్చున్నాడు.

పక్కనున్న రిసీవర్ ఎత్తి అతడు ఒక నంబరు తిప్పాడు.

"హాలో!" అంది ప్రేమ.

"శాంత యింట్లో ఎలా వున్నావు?""

"అఖండంగా వుంది. ఆయన యివాళ తొమ్మిదికే పడుకున్నారు" అందామె.

"అక్కడ నీ భర్తా, యిక్కడ నా భార్యా తొందరగా పడుకుంటే మనకు సమస్యలు వుండవు" అన్నాడతను.

"యూ ఆర్ రైట్" అందామె.

"ప్రేమా, యివాళనుంచి నీతో చెప్పినట్లు నా భార్యకు ట్రీట్ మెంట్ ప్రారంభించాను. ఆమె మానంగా నిద్రపోతోంది" అన్నాడతను.

"ఆమె రేపు లేస్తుందా?"

అతడు నవ్వాడు.

"రేపు నేను లేవని స్తేగా? మరో యింజక్షన్ ఇస్తాను. ఆమె అనారోగ్యంగా వుంది. ఎవ్వరూ ఆమె గదిలోకి వెళ్ళకూడదని చెప్తాను. పేరుకి డాక్టర్ కూనయ్య ట్రీట్ మెంట్ లో వుంటుందామె."

"ఇదంతా వింటూంటే నాకు భయంగా వుంది!" అంది ప్రేమ.

"ప్రేమా, ఇంతవరకూ ప్రేయసీ ప్రియులకు అడ్డొచ్చి వాళ్ళను చంపేసిందీ లోకం. ఇప్పుడు ప్రేయసీప్రియులు వాళ్ళ ప్రేమకు అడ్డొచ్చిన వాళ్ళను నిర్మూలించి కసి తీర్చుకోవాలి!"

"మీరు యిక్కడకు వెంటనే రండి" అందామె.

"నీ భర్త లేస్తాడేమో?"

"మీరిచ్చిన టాబ్లెట్ పాలల్లో కలిపి ఆయనకు యిచ్చాను. పాలు తాగి అవులిస్తూ ఆయన నిద్రపోయారు. పొద్దుటదాకా లేవరు" అందామె.

"ప్రేమా, వస్తున్నాను" అన్నాడతను.

రిసీవర్ పెట్టేసి ధనంజయరావు కిందకు దిగి తన కారువైపు వేగంగా వెళ్లాడు.

8

వారం రోజులనుంచి రాధ కోమాలో వుంటోంది. డాక్టర్ కూనయ్య వస్తున్నాడు, వెళ్తున్నాడు. ఆమె గదిలోకి ధనంజయరావు తప్ప ఎవ్వరూ వెళ్ళడంలేదు.

ఒకరోజు రాత్రి భోజనం చేస్తూండగా అతడి ఇద్దరు పిల్లలూ అమ్మను గురించి అడిగారు.

"అమ్మకెలా వుంది?" అడిగింది ఆరేళ్ళ విజయ.

"అమ్మ యిక్కడకు రాదా?" అడిగాడు నాలుగేళ్ళ నాగేష్.

ధనంజయరావు వాళ్ళవైపు నవ్వుతూ చూశాడు.

"మీ అమ్మ ఆరోగ్యం త్వరలో బాగుపడుతుంది. డాక్టర్ కూనయ్య ఆమె కోసం ఎంతో పాటుబడుతున్నాడు" అన్నాడతను.

"అమ్మను మేం చూడొచ్చా?" అడిగింది విజయ.

"తప్పక చూడొచ్చు. భోజనం అయ్యాక నేను మిమ్మల్ని ఆమె గదిలోకి తీసుకు వెళ్తాను" అన్నాడతను.

భోజనాలు అయ్యాక పిల్లల్ని ఆమె గదిలోకి తీసుకెళ్ళాడతను. రాధ మగత నిద్రలో వుంది. పిల్లలు ఆమెను చూస్తూ నిలబడ్డారు.

"ఇప్పుడు మీరు మీ గదికెళ్ళి హాయిగా పడుకోండి. మీ అమ్మ ఆరోగ్యం త్వరలో బాగుపడుతుంది" అన్నాడతను.

ఆయా పిల్లల్ని తీసుకుని వాళ్ళ గదివైపు వెళ్ళిపోయింది.

ఆ రోజు ఆదివారం. రాత్రి ఎప్పుడో రాధ మరణిం

-చింది.

పొద్దుటే డాక్టర్ కూనయ్య వచ్చి ఆమెను చూశాడు. చనిపోయిందని చెప్పి అతడు వెళ్ళిపోయాడు.

ధనంజయరావు తన పిల్లల్ని ముందు పెట్టుకుని ఏడుస్తూ కూర్చున్నాడు. అనేకమంది వచ్చి శవాన్ని చూసి వెళ్ళి పోయారు.

ప్రేమ విచారవదనంతో వచ్చింది. ధనంజయరావు ఆమెవంక ఏడుస్తూ చూశాడు.

"ప్రేమా, నువ్వు యివాళ యిక్కడే వుండు. నన్ను వదిలి వెళ్ళిపోకు" అన్నాడు తగ్గు స్వరంలో.

అతడి చుట్టూ అనేకమంది వున్నారు.

"రాధ నా భార్యగా పదేళ్ళపాటు జీవించింది. నా కిద్దరు పిల్లల్నియిచ్చింది. ఆమెను నేను మర్చిపోలేను" అన్నాడతను అందరూ వినేటట్లు.

సూర్యాస్తమయం అయే లోపల వాన్‌లో ఆమె శవాన్ని స్మశానానికి తీసుకుపోయారు. వేలాది ప్రజల సమక్షంలో రాధ శరీరం దహనం చేయబడింది.

చీకటి పడ్డాక ధనంజయరావు ఇంటికి తిరిగివచ్చాడు. ప్రేమ అతడికోసం అక్కడే వేచి వుంది.

ప్రేమను తన పడగ్గదిలోకి తీసుకెళ్ళాడతను. నవ్వుతూ ఆమెవైపు చూశాడు.

"ప్రేమా, మన ప్రేమకు అడ్డుగా నిలబడిన నా భార్య వెళ్ళిపోయింది" అన్నాడతను.

ఆమె అతడివైపు నవ్వుతూ చూసింది.

"మొదట్లో నేను భయపడ్డాను. ఎవ్వరూ అనుమానించకుండా మీరు ఆమెను పంపగలిగారు" అందామె.

ధనంజయరావు ఆమెను కౌగలించుకుని, పెదిమలను

ముద్దెట్టుకున్నాడు.

"ప్రేమా, నువ్వు నాతో యిక్కడ, యీ భవనంలో వుండాలి!"

"నా భర్త వుండగా అది సాధ్యంకాదు" అందామె.

"నీ భర్తకు కూడా రాధకిచ్చిన ట్రీట్ మెంట్ యివ్వాలి!"

"నాకు భయంగా వుంది" అందామె.

"నీకు నామీద నమ్మకం వుందా?"

"వుంది."

"అయితే అంతా నాకు వదిలేయి. ఏం చేయాలో నేను చూస్తాను."

"మీరు చెప్పినట్లే చేయండి" అందామె.

రాత్రి పదిదాటాక అతడు కారులో తీసుకువెళ్ళి ఆమెను యింట్లో దింపాడు.

ఆమె వెళ్తూ వెనక్కి తిరిగి అతడివైపు చూసింది. అతడు బై బై చెప్పాడు.

కారును వెనక్కి తిప్పి అతడు గేటుదాటి పోనిచ్చాడు. ఇప్పుడతడికి ఆనందంగా వుంది. ఏదో బాండెడ్ సెల్లరీనుంచి బయటపడినట్లు భావిస్తూ అతడు కారును పోనిచ్చాడు.

9

గదిలో లైటు వెలుగుతోంది. పరుపుమీద అతడి కెదురుగా ఆమె కూర్చుంది. అతడామెవైపు సూటిగా చూశాడు.

"ప్రేమా, నిన్ను ప్రేమించి నేను పెళ్ళాడాను. కొంత కాలంపాటు మన జీవితం సుఖంగా సాగింది. కాని యిప్పుడు ఎన్నో లోపాలు నాకు కనిపిస్తున్నాయి"

అన్నాడతను.

ఆమె మాట్లాడలేదు.

"ప్రేమా, ఒక రోజు ఓ వుంగరం నాకు చూపించి రూపాయిచ్చి కొన్నానన్నావు. ఆ వుంగరం తీసుకువెళ్ళి నేను పాపాలాల్ కి చూపించాను. దాని వెల లక్షా పది వేలు వుంటుందని పాపాలాల్ చెప్పాడు. ఆ వుంగరం గురించి నాతో ఎందుకు అబద్ధం చెప్పావు?"

ఆమె మాట్లాడలేదు.

"ప్రేమా, ఒక విషయం గుర్తుంచుకో! నువ్వు ఏం చేసినా నేను ఆనందిస్తాను. నువ్వు యీ లోకంలో విజయాన్ని సాధించినందుకు నేను సంతోషిస్తున్నాను."

"మీతో అబద్ధం చెప్పినందుకు నన్ను క్షమించండి. ఆ డైమండ్ రింగ్ ను నా బాస్ సింగపూర్ లో కొని తెచ్చి నాకిచ్చారు. మరో నకిలీ రింగుకూడా ఆయనే యిచ్చారు" అందామె.

అతడు ఆమెవైపు చూశాడు.

"ఈ యింటికి నువ్వు ఎంత అద్దె యివ్వాలి?" అడిగాడతను.

"నాకింకా తెలియదు."

"ప్రేమా, నిజం చెప్పు! నన్ను చూసి భయపడి అబద్ధం చెప్పకు. నేను నీ తోవకు అడ్డురాను. అవుసరమైతే నీకు పూర్తిగా స్వేచ్ఛ చేకూర్చి నేను బయటకు పోగలను."

ఆమె తీవ్రంగా ఆలోచిస్తోంది. అతడు ఆమెవైపే చూస్తున్నాడు.

"ప్రేమా, ధనంజయరావుకి నీనుంచి ఏం కావాలి?"

మెల్లిగా ప్రశ్నించాడతను.

"నేనంటే ఆయనకెంతో ప్రేమ. నేను లేకుండా ఆయన బ్రతకలేరు. ఈ ఇల్లు నా పేర ఆయన కొన్నారు" అందామె ధైర్యంగా.

అతడామె చెయ్యి పట్టుకున్నాడు.

"నిజం చెప్పినందుకు నిన్ను మెచ్చుకుంటున్నాను. నాకంటె వెయ్యిరెట్లు గొప్పవాడు నిన్ను అంతగా ప్రేమిస్తున్నందుకు సంతోషం. కాని నువ్వు అతడి వుంపుడుగత్తెగా వుండడం నాకిష్టంలేదు. నేను నీకు విడాకులిచ్చేస్తాను. అటుపైన ఆయనతో నీ పెళ్ళి అయేటట్లు చూస్తాను. నేను ఎల్లప్పుడూ కోరేది నీ ఆనందం" అన్నాడతను.

అతడివంక ఆమె ఆశ్చర్యంగా చూసింది.

టెలిఫోన్ మ్రోగింది. ఆమె ఫోన్ వైపు వెళ్ళింది. రామచంద్రమూర్తి బాత్‌రూంలోకి వెళ్ళి తలుపు దగ్గరగా మూశాడు.

"హాలో!" అందామె.

"ప్రేమా, యీ రాత్రినుంచి నీ భర్తకు ట్రీట్‌మెంట్ ప్రారంభిస్తాను. రెండు వారాల్లో అంతా అయిపోతుంది. అటుపైన మనం స్వేచ్ఛగా జీవించవచ్చు" అన్నాడు ధనంజయరావు.

"అదంతా అనవసరం" అందామె.

"ప్రేమా, ఏమైంది?"

"నా భర్తతో మన్ని గురించి అంతా చెప్పేశాను. ఆయన నా తోవకు అడ్డురానన్నారు. మీరు యిక్కడకు వచ్చి ఆయనతో మాట్లాడవచ్చు" అందామె.

"ప్రేమా, నీ భర్తని మెచ్చుకుంటున్నాను. మనం ముగ్గురం కూర్చుని మాట్లాడుదాం. ఏం చేయవలసిందీ ఆలోచిద్దాం."

"వెంటనే రండి" అందామె.

రామచంద్రమూర్తి గదిలోకొచ్చాడు.

"ఆయన యిక్కడకొస్తున్నారు. మనం మాట్లాడి అంతా సెటిల్ చేద్దాం అన్నారు" అందామె.

"గుడ్! మనలా యితరులు తమ సమస్యలను పరిష్కరించుకో గల్గితే లోకంలో పోట్లాటలూ, హత్యలూ వుండవు" అన్నాడతను నవ్వుతూ.

10

పోర్టికోలో కారాపి ధనంజయరావు వుషారుగా కిందకు దిగాడు.

ముందు తలుపు తెర్చి వుంది. అతడు మెట్లెక్కి పైకి వెళ్ళాడు. ప్రకాశవంతంగా లైటు వెల్గుతున్న పడగ్గది లోకి ప్రవేశించాడు.

అక్కడి దృశ్యాన్ని చూసి తారితిపోయాడు. గుండె దడ దడ కొట్టుకుంది.

రక్తం మడుగులో ప్రేమ వెల్లకిలా పడివుంది. పక్కనే పడున్నాడు రామచంద్రమూర్తి. అతడి కడుపులో కత్తి దిగివుంది.

బయటనుంచి కారు ఆగిన చప్పుడు వినపడింది. ఇన్‌స్పెక్టర్ రాజన్, నలుగురు కానిస్టేబులతో గదిలో కొచ్చాడు.

"ఇక్కడనుంచి మాకెవరు ఫోన్ చేశారు?" అన్నాడు యిన్‌స్పెక్టర్.

నేలమీద పడున్న రామచంద్రమూర్తి మూలుగుతూ యిన్‌స్పెక్టర్‌కి సౌజ్ఞ చేశాడు.

ఇన్‌స్పెక్టర్ అతడి దగ్గరకు వెళ్లాడు.

"ఏమిటైంది? ఎవరు పొడిచారు మిమ్మల్ని?"

రామచంద్రమూర్తి తన వేలును ధనంజయరావువైపు చూపించాడు.

"నా పెళ్లాన్ని, నన్నూ పొడిచేశాడు ...ఆయనే!" అని అతడు పక్కకు పడ్డాడు.

ఇన్‌స్పెక్టర్ రాజన్ అతడి నాడిని పరీక్షించాడు. నీరసంగా కొట్టుకుంటోంది.

"ఇతడిని వెంటనే హాస్పిటల్‌కు తీసుకు వెళ్ళండి" అన్నాడు యిన్‌స్పెక్టర్ ఒక కానిస్టేబులుతో.

రామచంద్రమూర్తిని యిద్దరు పోలీసులు కిందకు మోసుకుపోయారు. కారు కదిలిన చప్పుడు బయటనుంచి వినబడింది.

రక్తం మడుగులో పడున్న ఆమెను పరీక్షించి యిన్‌స్పెక్టర్ ధనంజయరావు వైపు చూశాడు.

"మీ పేరు?"

"ధనంజయరావు."

"వీళ్ళను ఎందుకు పొడిచి చంపారు?"

"నేను చంపలేదు. నేను యిక్కడకు వచ్చేసరికి వీళ్ళు ఆ స్థితిలో వున్నారు."

"కొన వూపిరితో ఆయన చెప్పిన మాటలకు కోర్టు ఎక్కువ విలువ యిస్తుంది" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"ఆ కత్తి పిడిమీద నా వేలిముద్రలు వుండవు! పరీక్షించి చూడండి!"

"మీరు తుడిచిపారేస్తే వుండకపోవచ్చు!" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"నాకు యీ హత్యలతో సంబంధంలేదు" అన్నాడు ధనంజయరావు కోపంగా.

"అది తర్వాత కోర్టులో తేల్తుంది. మర్డర్ చార్జి మీద మిమ్మల్ని అరస్టు చేస్తున్నా" అన్నాడు యిన్‌స్పెక్టర్ గంభీరంగా.

—: అ యి పో యి ం ది: —